www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 7 జనవరి 2025
5
అన్నమయ్య

## కొనసాగుతున్న కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియ

పరుగు పందెంలో పాల్గొన్న అభ్యర్థులు

**ప్రజాశక్తి-కడప అర్బన్ :** కడప నగర శివారులోని డిటిసిలో నిర్వహిస్తున్న కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియ ఆరో రోజు సోమవారం కొనసాగింది. అభ్యర్థులకు 1600 మీటర్లు, 100 మీటర్లు, లాంగ్ జంప్ పోటీలను నిర్వహించారు. మొత్తం 600 మంది అభ్యర్థులకు గాను 406 మంది పరీక్షలకు హాజరయ్యారు. 247 మంది క్వాలిఫై అయ్యారు. అభ్యర్థులకు పిఎంటి, పిఇటి పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, ఎఆర్ అడిషనల్ ఎస్పి బి.రమణయ్య, డిఎస్పిలు, సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఐటి కోర్ టీమ్, డిపిఒ కార్యాలయ సిబ్బంది ఉన్నారు. దేహదారుఢ్య పరీక్షల్లో ఇప్పటి వరకు ఉమ్మడి కడప జిల్లాలో 4,492 మంది అభ్యర్థులు పాల్గొన్నారు.

# నేడు జిల్లాకు కేంద్ర కరువు బృందం రాక

- ఏర్పాట్లు పటిష్టంగా పూర్తి చేయాలి
- కలెక్టర్ చామకూరి శ్రీధర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

**ప్రజాశక్తి - రాయచోటి**

నేడు, రేపు జిల్లాలో కేంద్ర కరువు బృందం పర్యటించనున్నందున అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లాలో కేంద్ర కరువు బృందం పర్యటన సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర కరువు పరిశీలన బృందం ఈనెల 7న బెంగళూరు నుంచి బయలుదేరి మదనపల్లి డివిజన్ హార్సిలీ హిల్స్ చేరుకొని బసచేస్తారన్నారు. 8న ఉదయం 9 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి మధ్యాహ్నం ఒంటిగంట వరకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తారని పేర్కొన్నారు. అదేరోజు మధ్యాహ్నం 2:30 గంటలకు జిల్లా నుంచి తిరిగి బెంగళూరు బయల్దేరి వెళ్తారని తెలిపారు. కేంద్ర కరువు బృందంలో మొత్తం నలుగురు సభ్యులు ఉంటారని ఇందులో కేంద్ర డిఎఅండ్ఎఫ్ డబ్ల్యూ శాఖ, విధానాలు, సమన్వయం జాయింట్ సెక్రటరీ మిస్సెస్ పేరినీదేవి ఆధ్వర్యంలో ముగ్గురు సభ్యుల బృందం జిల్లాల పర్యటిస్తుందని తెలిపారు. 2024 ఖరీఫ్ సీజన్ జూన్ నుంచి సెప్టెంబర్ వరకు జిల్లాలో ఏర్పడిన కరువు పరిస్థితులను వారు పరిశీలిస్తుందని చెప్పారు. అప్పటి పరిస్థితులను కళ్ళకు కట్టే విధంగా ఛాయ చిత్ర ప్రదర్శన ఏర్పాటుచేసి కరువు బృందానికి వివరించాలన్నారు. క్షేత్రస్థాయిలో కూడా వాస్తవ పరిస్థితులు వారికి అవగాహన కలిగేలా అధికారులు వివరించాలన్నారు. ఎందుకు సంబంధించిన స్పష్టమైన నివేదికల రూపొందించాలని సూచించారు. అనంతరం వివిధ అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు జారీ చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదన్ రావు, ఇన్‌ఛార్జి సిపిఒ వెంకట పెద్దయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కన్న తండ్రే కామాంధుడు

- ఇద్దరు కూతుళ్లపై అత్యాచారం
- భర్త అఘాయిత్యంపై పోలీసులకు ఫిర్యాదు చేసిన భార్య
- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

కామాంధుడు బోయకొండ

**ప్రజాశక్తి-నిమ్మనపల్లె**

పేగు తెంచుకొని పుట్టిన కూతుళ్లను కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రే కామాంధుడుగా మారి అత్యాచారానికి ఒడిగట్టాడు. అల్లారు ముద్దుగా పెంచి అందమైన జీవితాన్ని ఇవ్వాల్సిన తండ్రే తన ఇద్దరు ఆడపిల్లలుపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. తండ్రి ఆగడాలను భరించలేక నొప్పి తాళలేక అమ్మమ్మ, మేనమామకు బాధను చెప్పుకున్నారు. మండలం కొండయ్యగారిపల్లి పంచాయతీ వెంకోజి గారిపల్లి శివాజీ నగర్‌లో ఈ దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శివాజీనగర్‌కు చెందిన బోయకొండ (28), చిట్టెమ్మ (26) దంపతులకు ఐదుగురు సంతానం. కొడుకు పెద్దవాడు కాగా, మిగిలిన నలుగురు ఆడపిల్లలు. బోయకొండ చెట్లు కోసేందుకు, కూలి పనులు వెళుతుంటాడు. భార్య చిట్టెమ్మ గ్రామాలు తిరుగుతూ గాజుల అమ్మేందుకు వెళుతుంది. ఈ క్రమంలో మద్యానికి అలవాటు పడ్డ కూలి చేసి సంపాదించిన డబ్బును తాగుడుకు ఖర్చు చేసేవాడు. భార్య గాజులు అమ్మేందుకు బయటకు వెళ్లడంతో మద్యం మత్తులో ఇంటి పట్టునే ఉంటున్న బోయకొండ కన్ను ఇంటిలో ఉంటున్న కూతుర్లపై పడింది. మూడో రోజుల క్రితం పెద్ద కుమార్తె(9)పై, మరుసటి రోజు రెండవ కుమార్తె(7)పై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. మూడవరోజు తన ఏడేళ్ల కూతురిపై అఘాయిత్యానికి పాల్పడానికి తీసుకెళుతుండగా, బోయకొండ అత్త గమనించి పాపను ఎక్కడ తీసుకెళ్తున్నావు అంటూ మందలించడంతో వదిలేశాడు. రెండు రోజులుగా పిల్లలు నొప్పి ఉందంటూ ఏడుస్తూ బాధను వారి అమ్మమ్మకు, మేనమామకు చెప్పుకొచ్చారు. వారు ఏమి జరిగిందని ఆరా తీస్తే అసలు విషయం బయటపడింది. తండ్రి చేసిన కృత్యాలను బిడ్డలు ఒక్కొక్కటిగా కడుపు తరుక్కుపోయిన అమ్మమ్మ, మేనమామ, తల్లి చిట్టెమ్మకు సమాచారం అందించారు. తల్లడిల్లిన కన్నపేగు బిడ్డల పరిస్థితిని చూసి చెల్లించిపోయింది. కన్న బిడ్డలపై అఘాయిత్యానికి పాల్పడుతున్న కీచక తండ్రిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడు బోయకొండను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మదనపల్లి రూరల్ సర్కిల్ సిఐ రమేష్, స్థానిక పోలీసులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి బాధిత కుటుంబ సభ్యులను విచారించారు. ఘటనకు సంబంధించిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ విచారణలో కూతుళ్లపై తండ్రి లైంగిక దాడికి పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో నిందితుడపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# అద్దెలు చెల్లించే వరకూ పోరాడుదాం

- నిరసనలో అంగన్వాడీ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మి

నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

**ప్రజాశక్తి - రాయచోటి టౌన్**

అన్నమయ్య జిల్లా రాయచోటి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న రాయచోటి, చిన్నమండెం, సంబేపల్లి మండల్లాలోని అంగన్వాడీ సెంటర్లకు 9 నెలల అద్దెలు ఇవ్వకుండా కాలయాపన చేయడం తగదని, అద్దెలు చెల్లించే వరకూ పోరాటం ఆపమని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సోమవారం స్థానిక రాజులు కాలనీలోని ఐసిడిసిన్ కార్యాలయం ఎదుట రాయచోటి ప్రాజెక్ట్ వర్కర్లు అధ్యక్షులు వి.సిద్దమ్మ అధ్యక్షతన పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డి.భాగ్యలక్ష్మి జిల్లా కోశాధికారి పి.బంగారుపాప మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లు చాలీచాలని వేతనాలతో పనిచేస్తూ అంగన్వాడి సెంటర్లను నెట్టుకు రావడమే గాక సెంటర్లో సౌకర్యాలయిన కూరగాయలు గ్యాస్ ల కోసం అప్పులు చేసి సెంటర్లు నిర్వహిస్తూ ప్రభుత్వాన్నికి మంచి పేరు వచ్చేలా చేస్తే వీరి కోసం ప్రభుత్వం బడ్జెట్ లో నిధులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతూ కాలయాపన చేయడం తగదని ఆరోపించారు. ఐసీడి ఎస్ కార్యాలయం నుండి బిల్లులు పంపకుండా నిర్లక్ష్యంచేస్తున్నారా? లేదా! రాష్ట్ర కూటమి ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదా? అనే దానిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ సెంటర్ అద్దెల నుంచి విముక్తి కలిగించే బాధ్యత ప్రభుత్వ అధికారులు బాధ్యత తీసుకోకపోతే ఈనెల 11న సిఐటియు ఆధ్వర్యంలో లో ఇతర ప్రజా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిమాండ్ లతో కూడిన వినతి పత్రాన్ని సిడిపివో శశికళ కు అందించారు. సానుకూలంగా స్పందించిన ఆమె ప్రస్తుతానికి నాలుగు నెలల బిల్లులు చెల్లిస్తామని, పండగ తర్వాత అన్ని రకాల బిల్లులు చెల్లించేలా హామీ ఇచ్చారు. అనంతరం ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా సుండుపల్లి రోడ్డులో జెండా ఆవిష్కరించారు. అంగన్వాడీ విశిష్టత విజయాలు భవిష్యత్తు కర్తవ్యాలపైన, గతంలో సాధించిన విజయాలను స్ఫూర్తిగా తీసుకొని అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించేంత వరకు, ఐసిడియస్ బలోపేతం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాయచోటి ప్రాజెక్ట్ నాయకులు నాగమణి అరుణ, సబీనా, సుమలత లక్ష్మీదేవి, రమణమ్మ, జయ అంజలి, ఉమా, మూడు మండలాల వర్కర్లు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధి ఫలితాలు రావాలి : కలెక్టర్

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్, జెసి ఆదర్శ రాజేంద్రన్

**ప్రజాశక్తి - రాయచోటి**

జిల్లాలో నైపుణ్య శిక్షణ ద్వారా ఉత్తమ ఉపాధి ఫలితాలు వచ్చేందుకు కృషి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి స్కిల్ కమిటీ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి దాసరి నాగార్జున, కమిటీ సభ్యులందరూ జిల్లాలో నైపుణ్య శిక్షణల గురించి వారి వారి అభిప్రాయాలను కలెక్టర్‌కు వివరించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా సంకల్ప స్కీం ద్వారా జిల్లాలో చేపట్టాల్సిన నైపుణ్య కార్యక్రమాల గురించి కమిటీ సభ్యులందరికీ వివరించారు. ఈ సందర్భంగా భవిష్యత్తు కార్యక్రమం గురించి కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశంలో చర్చించారు. జిల్లాలో చదువుకున్న నిరుద్యోగ యువతకు జీవనోపాధికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించే విధంగా కార్యక్రమాలను రూపకల్పన చేయాలని జిల్లా నైపుణ్యా అభివృద్ధి అధికారిని, సభ్యులకు కలెక్టర్ సూచించారు. అనంతరం వివిధ అంశాల్లో తగు సూచనలు జారీ చేశారు. పిఎం ఇంటర్న్‌షిప్ కరపత్రాలను కలెక్టర్, జెసి ఆవిష్కరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్‌డిఎ, మెప్మా పీడీలు, జెడి అగ్రికల్చర్, ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్, లీడ్ బ్యాంకు మేనేజర్, రాయచోటి మున్సిపల్ కమిషనర్, కమిటీ సభ్యులు, నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# బోగస్ పింఛన్ల ఏరివేతకు శ్రీకారం

సదరం సర్టిఫికెట్ల విచారణ చేస్తున్న వైద్య అధికారులు

**ప్రజాశక్తి-పీలేరు**

ప్రభుత్వ ఆదేశాల మేరకు పీలేరు మండలంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక బోగస్ పెన్షన్ల ఏరివేతకు వేట మొదలైంది. వైఎస్ఆర్ పెన్షన్ కానుక పేరుతో గత జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక ప్రతిభావంతులకు కొన్ని పెన్షన్లు మంజూరు చేసింది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన తెలుగుదేశం ప్రభుత్వం వాటిని ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లుగా పేరు మార్చి మంచానికి పరిమితమైన వారికి రూ.15 వేలకు పెంచి ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి కొనసాగిస్తోంది. అనర్హులు కొందరు బోగస్ సదరం సర్టిఫికెట్లను సమర్పించి నెలనెలా పెన్షన్ పొందుతూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారని ఫిర్యాదులు వెళ్లాయి. స్పందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం బోగస్ పెన్షన్ల ఏరివేతకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఆ అధికారుల బృందం పీలేరులో సోమవారం నుంచి రంగంలోకి దిగింది. నేరుగా లబ్ధిదారుల ఇళ్ళకే వెళ్లి పెన్షన్ కోసం వారు సమర్పించిన ధృవపత్రాల పునఃపరిశీలన చేస్తూ బోగస్ లబ్ధిదారుల ఏరివేత కార్యక్రమానికి శ్రీకారంచుట్టింది. పీలేరు మండల పరిధిలో మొత్తం 76 ప్రత్యేక ప్రతిభావంతుల పెన్షన్లు ఉన్నాయి. వీటిపై కడప రిమ్స్ ఆసుపత్రి ప్రొఫెసర్ డాక్టర్ ఆనంద్ మనోహర్, పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.చంద్రశేఖర్, డాక్టర్లు రమేష్‌రెడ్డి, కార్తీక్‌కుమార్ ఆధ్వర్యంలో విచారణ నిర్వహించారు. ప్రభుత్వం నుంచి సామాజిక పెన్షన్లు అందుకుంటున్న బోగస్ లబ్ధిదారుల ఏరివేతను సోమవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు పీలేరు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ లతీఫ్ ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో 7న రేగళ్ళు, బాలంవారిపల్లి, దొడ్డిపల్లి, అగ్రహారం సచివాలయాల్లోను, 8న వేపులబైలు, ముడుపులవేముల, బోడుమల్లువారిపల్లి, గూడరేవుపల్లి, తలుపుల, మేళ్లచెరువు సచివాలయాల్లోనూ సదరం సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందన్నారు.

## విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపల్, ఎంఇఒ

**ప్రజాశక్తి-కలకడ**

కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు ప్రిన్సిపల్ సుమిత్ర తెలిపారు. మండలంలోని బాటవారిపల్లి పంచాయతీ గరుడప్పగారిపల్లిలో ఉన్న ఆంధ్రప్రదేశ్ బాలికల గురుకుల పాఠశాలను కలెక్టర్ చామకూరి శ్రీధర్ గత ఏడాది నవంబర్ 23వ తేదీన తనిఖీలు నిర్వహించిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ క్రమంలో తనిఖీలలో భాగంగా ఆ రోజున విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేని విషయం గుర్తించి, కలెక్టర్ బాలికలకు దుప్పట్లను, వారి కావాల్సిన సౌకర్యాలను కల్పించాలని సిబ్బందిని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎంఇఒ మునీంద్రనాయక్, ప్రిన్సిపల్ సుమిత్ర కలిసి సుమారు 350 మంది విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిలు చలితో ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించిన అధికారులు విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయడం జరిగిందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది కార్యదర్శులు నాగభూషణ, బాలాజీ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## 'మిట్స్' ఎంసిఎ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్

**ప్రజాశక్తి-మదనపల్లి**

మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్‌లో ఎంఇఎ విద్యార్థులకు పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల కోసం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ పరివర్తన్ ఇసిఎస్ఎస్ ప్రోగ్రామ్ మెరిట్-కమ్-నీడ్ బేస్డ్ స్కాలర్‌షిప్‌లు అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. దొడ్ల దీప్త, నాదెండ్ల గిరి, బి.సహిత, కంసల సంధ్యా రాణిలకు ఈ స్కాలర్‌షిప్‌లు లభించినట్లు వీరికి ఒక్కక్కరికి రూ.35 వేలు అందజేశామన్నారు. విద్యార్థుల మెరిట్‌ను పరిగణలోకి తీసుకొని ఈ స్కాలర్‌షిప్‌లు అందజేసినట్లు ఎంపికైన విద్యార్థులను కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, మోలాలి తదితరులు అభినందనలు తెలియజేశారు.

స్కాలర్‌షిప్ పత్రాలను ఇస్తున్న ప్రిన్సిపల్ యువరాజ్

## ఎస్‌పిని కలిసిన చమర్తి సురేష్‌రాజు

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

సోమవారం అన్నమయ్య జిల్లా రాయచోటి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి విద్యా సాగర్ నాయుడును డిఐజి కోయా ప్రవీణ్ కుమార్ సూచనల మేరకు రాజంపేట మాజీ వ్యవసాయ కమిటీ ఛైర్మన్, మదనపల్లె సమన్వయ కర్త చమర్తి సురేష్ రాజు మర్యాదపూర్వకంగా కలిసి పలు విషయాలపై చర్చించారు.

వినతులు స్వీకరిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

## శ్రీనాథరెడ్డికి అభ్యుదయ రైతు అవార్డు

**ప్రజాశక్తి-రామాపురం**

మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీ బి. రాచపల్లి పంచాయతీకి చెందిన మోపూరి శ్రీనాథ్‌రెడ్డి విజ్ఞాన గ్రూప్ సంస్థ యూనివర్సిటీ ద్వారా సేంద్రీయ అభ్యుదయ రైతు అవార్డు అందుకున్నారు. సంక్రాంతి సంబరాలు లోభాగంగా గుంటూరులోని విజ్ఞాన్ గ్రూప్ సంస్థల యూనివర్సిటీ నిర్వహించిన మహోత్సవంలో మోపూరి శ్రీనాథ్‌రెడ్డి దంపతులకు అవార్డును రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చేతుల మీదుగా అందుకున్నారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యువత శ్రీనాథ్‌రెడ్డి దంపతులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వీరు బెంగళూరులో ఐటి ఉద్యోగం చేస్తూ విలాసంతమైన జీవితాన్ని గడుపుతూ వ్యవసాయంపై మక్కువతో ఉద్యోగాన్ని వదులుకొని తమకున్న వ్యవసాయ భూమిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ ఆరోగ్యవంతమైన పంటలు పండిస్తున్నారని చెప్పారు. చుట్టుపక్కల గ్రామాల రైతులకు సేంద్రియ వ్యవసాయ పట్ల ఆసక్తి కలిగించి ఆదర్శంగా నిలిచారన్నారు ఇలాంటి దంపతులకు అవార్డు అందించడం సంతోషంగా ఉందన్నారు. మన ప్రభుత్వం ఆధునికతను వ్యవసాయ రంగానికి అనుసంధానం చేస్తామని యువత వ్యవసాయం పట్ల మక్కువపెంచుకోవాలన్నారు.

మోపూరి శ్రీనాథ్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

# రోడ్లు, కాలువలు నిర్మించాలని సబ్ కలెక్టర్‌కు వినతి

రోడ్లు, కాలువలు నిర్మించాలంటున్న తురకపల్లె వాసులు

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

పదేళ్లుగా మా గ్రామంలో రోడ్లు, మురికినీటి కాలవలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని పోతుబోలు పంచాయతీ, శానిటోరియం సమీపంలోని తురకపల్లి గ్రామస్తులు సోమవారం మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌కు విన్నవించారు. స్పందన కార్యక్రమంలో భాగంగా తురకపల్లికు చెందిన గ్రామస్తులు సబ్ కలెక్టర్ కార్యాలయంకు చేరుకుని తమ గోడును వెల్లబోసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ శానిటోరియం సమీపంలోని తురకపల్లె లోకల్ అథారిటీ పరిధిలోకి రావడంతో ఎలాంటి అభివృద్ధి పనులకు నోచుకోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. సుమారు 500 పైగా కుటుంబాలు ఉన్న ఈ ప్రాంతంలో మురికినీటి కాలువలు లేకపోవడంతో తాగునీరు కలుషితమై, దోమలు వ్యాప్తి చెంది తరచూ రోగాల బారిన పడుతున్నామన్నారు. గతంలో పలుమార్లు ఎంపిడిఒ, తహశీల్దార్‌లను కలిసి సమస్యలను విన్నవిస్తే లోకల్ అథారిటీ పరిధిలో ఉన్న కారణం చేత తాము ఏమి చేయాలేమని చెప్పారన్నారు. లోకల్ అథారిటీ ఛైర్మన్‌గా ఉన్న సబ్ కలెక్టర్ స్పందించి తమను ఆదుకోవాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ మేరకు విచారణ చేసి తగు న్యాయం చేస్తామని సబ్ కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు.

**తాగునీటికి తీవ్ర ఇబ్బందులు :** ఏడాదిగా తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పట్టణంలోని ఎస్బీఐ కాలనీ 2, 3 రోడ్లలో నివాసముంటున్న మహిళలు వాపోయారు. సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌ను కలిసి సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్బీఐ కాలనీ 2, 3 రోడ్లలో నివాసం ఉంటున్న తమకు ఏడాదిగా తీవ్ర తాగునీటి కష్టాలు ఎదురయ్యాయన్నారు. నీళ్ల వదిలే ద్వారక, చక్రపాణిరెడ్డిలను అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని, ఛైర్మన్ దృష్టికి సమస్యను తీసుకెళ్లినా సమస్య పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు స్పందించి తమ ప్రాంతంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. సబ్ కలెక్టర్‌ను కలిసిన వారిలో ఎస్బీఐ కాలని అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆదిరెడ్డి, నాగరాజు, హేమ ప్రకాష్, హసీనా బేగం, సునీత, కళావతి, విజయ, శారద, మంజుల, చంద్రమ్మ, శోభ, తులసి ఉన్నారు.

**పారిశుధ్య సమస్య పరిష్కరించండి :** పారిశుధ్యం లోపించి అంటు వ్యాధుల బారిన పడుతున్నామని సిటిఎం-2 గ్రామస్తులు స్థానిక గ్రామ సచివాలయం వద్ద నిరసన తెలిపారు. గ్రామస్తుల నిరసనకు టిడిపి నాయకులు రెడ్డి రాంప్రసాద్, చల్లా నరసింహులు, చల్లా శ్రీనివాసులు, మిట్టపల్లి రాజు, మిట్టపల్లి భాను, నరసింహులు, శంకర్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ వేతనాలు, ఇవ్వడం లేదని పంచాయతీ కార్మికులు విధులకు గైర్హాజరు కావడంతో చెత్తాచెదారం పేరుకుపోయి, దోమలు విపరీతంగా ప్రబలుతున్నాయన్నారు. సర్పంచ్ వెంటనే స్పందించి పంచాయతీ కార్మికులకు వేతనాలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని, తద్వారా ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

**ప్రజాశక్తి - చిన్నమండెం**

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదార్బన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బొరెడ్డిగారిపల్లెలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏ ఒక్కరు సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడుగారి ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో ఎక్కువగా భూ సమస్యలు ఉన్నాయని భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతోందన్నారు. రాబోయే రోజులలో శాశ్వత భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. మంత్రి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

## ఎలక్ట్రికల్ షాపు అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఆరవేటి వాసు

**ప్రజాశక్తి - రాయచోటి టౌన్**

రాయచోటి ఎలక్ట్రికల్ షాపు యజమానుల అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఆరవేటి వాసును సోమవారం షాపు యజమానులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాయచోటి పట్టణంలో ఉన్న ఎలక్ట్రికల్ షాపు యజమానులకు ఎలాంటి సమస్య వచ్చినా ముందుండి పరిష్కరించేందుకు కృషి చేస్తానని అలాగే అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా పెన్నార్ బాబ్జి, కోశాధికారిగా సునీత, రెడ్డప్ప, ఉపాధ్యక్షుడిగా జోహార్, గౌరవ అధ్యక్షులుగా చెన్నూరు నిసార్, కార్యదర్శిగా శ్రీనివాసులు ఎన్నికయ్యారు. సభ్యులుగా హనుమాన్, బ్రైట్ సర్దార్, నవీన్, ఇమ్రాన్, మహేష్, ఆరిఫ్,రెడ్డి దీపక్, ఆఫ్తాబ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో గంగిరెడ్డి, ఆదిరెడ్డి జనతా, వాజీద్,అహ్మద్ అలీ అన్ని షాపు యజమానులు పాల్గొన్నారు.

గోకులంను పరిశీలిస్తున్న పెంచలయ్య

## గోకులాలను పరిశీలించిన ఎపిఒ

**ప్రజాశక్తి-రామాపురం**

మండలంలోని నీలకంఠరావుపేటలో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన గోకులాలను సోమవారం ఉపాధి హామీ ఎపిఒ పెంచలయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గోకులాల కొలతలు పని నాణ్యత పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు గోకులాలను సద్వినియోగం చేసుకోవాలని పాడి పశువుల పెంపకానికి వినియోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రకృతి సేద్యం లాభదాయకం

**ప్రజాశక్తి - నందలూరు**

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో లాభదాయకం, ఆరోగ్యకరమని ప్రక ృతి వ్యవసాయ ఉత్పత్తుల యూనిట్ ఇన్‌ఛార్జి కృష్ణయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వల్ల కలిగే లాభాల గురించి ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడులు పెట్టి ఎక్కువ ఆదాయం పొందవచ్చునన్నారు. రసాయనిక ఎరువులు వాడటం వల్ల వచ్చే ఉత్పత్తుల వల్ల అనారోగ్యాల పాలవుతున్నారని తెలిపారు. ఘన, ద్రవ, బీజామ ృతం లతోపాటు ప్రకృతి ఎరువుల ద్వారానే తాము పంటలు పండించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డివిజనల్ మోడల్ మేకర్ పుష్ప, ఐసిఆర్‌పిలు విజయ కుమారి, శ్యామల పాల్గొన్నారు.

దాత సుధీర్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపల్

## జూనియర్ కళాశాలకు భోజనం ప్లేట్లు వితరణ

**ప్రజాశక్తి - నందలూరు**

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకం కొరకు శ్రీ సౌమ్యనాథ ఫిల్లింగ్ స్టేషన్ అధినేత ఉప్పు శెట్టి సుధీర్ 120 స్టీల్ భోజనం ప్లేట్లను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీదేవి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నిర్వహణలో భాగంగా దాత ఉప్పు శెట్టి సుధీర్ విద్యార్థుల కోసం ప్లేట్లు అందించడం అభినంద నీయమన్నారు. ఇవి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం దాతను ప్రిన్సిపల్, అధ్యాపకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## జిల్లా అభివృద్ధి సలహా సంఘం సభ్యుడిగా హబీబ్‌బాషా

**ప్రజాశక్తి-పీలేరు**

జిల్లా అభివృద్ధి సమన్వయ సలహా సంఘం సభ్యుడిగా పీలేరు గ్రామ పంచాయతీ సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాషాకు మరోసారి అవకాశం లభించింది. కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లాలో నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. కమిటీకి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి అధ్యక్షుడిగా, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి కో-కన్వీనరుగా, జిల్లాలోని శాసనసభ్యులు సభ్యులుగా ఉంటారు. హబీబ్ బాష మాట్లాడుతూ ఈ కమిటీలో తనకు మరోసారి అవకాశం కల్పించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని సోమవారం తిరుపతిలోని ఆయన నివాసంలో కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకున్నారు. ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డిలకు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

## పొంచివున్న ప్రమాదం

**ప్రజాశక్తి - రామసముద్రం**

మండలంలోని మినికి గ్రామ సచివాలయానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ పిచ్చి తీగలు ఏపుగా అల్లుకున్నాయి. ప్రజలు, కాలనీ వాసులు వివిధ పనుల నిమిత్తం ఈ ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే రాకపోకలు సాగిస్తున్నారు. మొక్కలకు విద్యుత్ సరఫరా అయ్యే ప్రమాద అవకాశాలు లేకపోలేదు. ఏ సమయంలోనైనా గ్రామంలో టీవీలు ఫ్రిజ్‌లు, సెల్‌ఫోన్లు పేలిపోయే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యం వీడి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. పగలు రాత్రి అనే తేడా లేకుండా గ్రామంలో వీధిదీపాలు నిత్యం వెలుగుతూనే ఉన్నాయి. సంబంధిత అధికారులు చర్యలు సూన్యం.

ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న తీగలు

## జాతీయ యూత్ ఫెస్ట్‌కు కడప అమ్మాయి

**ప్రజాశక్తి - కడప అర్బన్**

జాతీయ యూత్ ఫెస్ట్‌కు కడప అమ్మాయి ఎంపికైనట్లు జిల్లా యువజన అధికారి మణికంఠ ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. జాతీయ యూత్ ఫెస్టివల్ 2025 గాను నేషనల్ యూత్ పార్లమెంట్ 2024 అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థుల్లో 32 మంది విద్యార్థులను ఎంపిక చేశారని తెలిపారు. వారికి రెండు రౌండ్లల్లో పోటీలు నిర్వహించారని పేర్కొన్నారు. అందులో నుంచి అన్ని రాష్ట్రాలను కలిపి 10మంది పిల్లలను యాంకర్ లుగా ఎంపిక చేశారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తరపు నుంచి కడపకు చెందిన సయ్యద్ సానియా నేషనల్ యంగ్ లీడర్‌షిప్ డైలాగ్‌కి యాంకర్ గా ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈనెల 10 - 12 వరకు ఢిల్లీలో నిర్వహించబోయే నేషనల్ యంగ్ లీడర్ డైలాగ్ అనే కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రి మన్సుఖ్ మాండవిమా, ఇతర మంత్రులు కార్యక్రమానికి అధ్యక్షత వహించనున్నారాని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి మన కడప అమ్మాయి ఎంపిక కావడం చాలా గర్వకారణమని పేర్కొన్నారు.

## జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థుల సత్తా

**ప్రజాశక్తి - కడప అర్బన్**

రాయపూర్‌లో ఈనెల 2 నుంచి 6 వరకు నిర్వహించిన లికురాష్లి (కుస్తీ) 58వ స్కూల్ గేమ్స్ జాతీయస్థాయి పోటీలలో కడప క్రీడాకారులు రజిత పతాకాలు సాధించారు. అండర్-17 విభాగం 73 కిలోల పోటీలో బి.శ్రీశశాంక్ రజత పతకం సాధించాడు. అండర్-19 విభాగంలో 60 కిలోల పోటీలో నవాజ్ ఉర్ రెహమాన్ కాంస్య పతకం సాధించాడు. వీరి విజయం పట్ల కోచ్ వెంకటేష్, కడప జిల్లా అండర్ - 19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ శారదా, సుబ్బరాజు అభినందనలు తెలిపారు.

# ప్రజా సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి : కలెక్టర్

సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

**ప్రజాశక్తి- రాయచోటి**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం- పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారం పై నేరుగా పర్యవేక్షణ చేస్తుందని చెప్పారు. ప్రతి సమస్యను ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలని చెప్పారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ మధుసూదనరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్‌సెల్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాశక్తి-గాలివీడు**

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ సెల్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ జె. భాగ్యలత పేర్కొన్నారు. భూ సమస్యలు, ఇతర అవసరాల కోసం ప్రజలు తమ కార్యాలయానికి వచ్చి అర్జీ సమర్పిస్తే పరిష్కరిస్తామని ఆమె చెప్పారు. అంతకు మించిన సమస్య అయితే ఆర్‌డిఒ, జెసి, కలెక్టర్ ద్వారా పరిష్కరించడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిటి, ఆర్ఐ, విఆర్ఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

# వర్మీ కంపోస్టుతో అధిక దిగుబడులు

**ప్రజాశక్తి - పుల్లంపేట**

వర్మీ కంపోస్టుతో ఎరువులతో అధిక దిగుబడులు సాధించ వచ్చని ఇఒపిఆర్‌డి ముత్తయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొని రావడంలో భాగంగా పుల్లంపేట, గారాలమడుగు, రెడ్డిపల్లి, తిప్పాయపల్లి తదితర గ్రామ పంచాయతీలలో వర్మి కంపోస్టు ఎరువు తయారు చేయ డంలో భాగంగా వర్మి తొట్లలో వానపాములను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక దిగుబడులు సాధన లక్ష్యంగా తాగుతున్న వ్యవసాయానికి రోజురోజుకి అధిక రసాయనిక ఎరువుల వినియోగం పెరిగిపోతుందని తెలిపారు. భూమి నిసారంగా మారుతున్న తరుణంలో సేంద్రియ ఎరువులు వాడటం ద్వారా భూమిలో కార్బన్ శాతంను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. సేంద్రియ ఎరువులు అంటే పశువుల ఎరువు, పాచి రొట్ట ఎరువు, జీవన ఎరువు, వర్మి కంపోస్టు వానపాముల విసర్జితమే వర్మీ కంపోస్ట్ అని తెలియజేశారు. ఎలా తయారు చేసుకోవాలని విధానాన్ని తెలిపారు. మిగిలి ఉన్న గ్రామ పంచాయతీలలో కూడా చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి, విఆర్ఒ నరసింహ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వానపాములను వదులుతున్న సిబ్బంది

# యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

చిన్నమండెం : మల్లూరులో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మౌర్యరెడ్డి

**ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లె**

కూటమి ప్రభుత్వంలో క్రీడలకు పెద్దపీట వేసిందని, రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో అన్నమయ్య జిల్లాను క్రీడా హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారన్నారని టిడిపి నాయకులు మౌర్యరెడ్డి అన్నారు. మండలంలోని కోనంపేట గ్రామంలో శివాజీ ఆధ్వర్యంలో ఆర్‌సి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ టోర్నమెంట్లో లక్కిరెడ్డిపల్లి టిడిపి మండల నాయకులు యనమల మదన మోహన్, మాజీ ఎపిఐఐసి చైర్మన్ ఎర్రగుడి చంద్రశేఖర్‌రెడ్డిలతో కలిసి మౌర్యరెడ్డి అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడ నిర్వాప కులు వారికి ఘన స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రికెట్ పోటీలను మౌర్యరెడ్డి ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహద పడతాయన్నారు. యువత చదువుతోపాటు క్రీడల్లోనూ మంచి ప్రతిభను కనబరిచాలన్నారు. యువతలో క్రీడా నైపుణ్యం వెలికి తీసేలా మండల స్థాయి టోర్నమెంట్ నిర్వహించి గెలుపొందిన వారికి ప్రైజ్ మనీని కూడా అందజేస్తున్న నిర్వాహకులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని ప్రతి ఒక్కరు కూడా క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలని సూచించారు. మండలం వ్యాప్తంగా ఉన్న యువత ఈ క్రికెట్ క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకొని మండల స్థాయి నుండి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు ఎదగాలని వారు లక్కిరెడ్డిపల్లి టిడిపి మండల నాయకులు యనమల మదన్మోహన్ ఆకాంక్షించారు. క్రికెట్ పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.30 వేలు రెండవ బహుమతిగా రూ.15 వేలు క్యాష్ మనీ యువ నున్నట్లు క్రికెట్ నిర్వాహకులు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు, అభిమానులు, క్రీడాకారులు యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### మల్లూరులో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

**చిన్నమండెం:** మండల పరిధిలోని మల్లూరు గ్రామంలో సోమవారం మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను టిడిపి నాయకులు మౌర్యరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు నగదు రూపంలో ఇస్తారన్నారు. క్రీడాకారులు అందరూ గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని తెలిపారు. ఓడినవారు రాబోయే ఆటలలో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ పోటీలలో చిన్నమండెం మండలంలోని క్రీడాకారులందరూ పాల్గొని క్రికెట్ పోటీలను విజయవంతం చేయాలన్నారు.

# అంధత్వాన్ని జయించి.. ఆత్మవిశ్వాసంతో నిలిచి

**పుట్టుకతోనే అంధురాలు.. భర్త, తల్లిదండ్రులు లేరు.. వారున్నంత వరకు ఆమెకు ఆదరణ ఉండేది.. ఎనిమిదేళ్ల క్రితం భర్త దూరమయ్యాడు.. ఆమె జీవితం మరింత అంధకారంగా మారింది.. ఏమి చేయాలో తెలియని పరిస్థితి.. ఈ నేపథ్యంలో ఆమెకు వచ్చిన ఒక ఆలోచన తన జీవన మనుగడకు దారి చూపింది. అదే అల్లికలు.. తన స్నేహితురాలి వద్ద 20రోజులు శిక్షణ తీసుకుని తన కాళ్లమీద తాను నిలబడింది. అన్నీవున్నా నిరాశతో ఉండే ఎందరికో స్ఫూర్తి కట్టా అనంతమ్మ.**

తయారు చేసిన డోర్ మ్యాట్లు, తయారీలో నిమగ్నమైన అనంతమ్మ

**ప్రజాశక్తి - లింగాల**

సాధించాలనే పట్టుదల, కృషి, సంకల్పం ఉంటే సాటిలేరని ఓ అంధురాలు నిరూపిస్తోంది. తన జీవన ప్రయాణంలో అడుగులు వేయాల్సిన భర్త అకాల మరణంతో కుటుంబం పోషణకు ఆమె చేతి వృత్తిని ఎంచుకుంది. అంధురాలు కావడంతో రంగుల ప్రపంచాన్ని చూడలేకపోయినా జీవన మనుగడ కోసం దృఢసంకల్పంతో తన స్నేహితురాలు వద్ద చేతి వృత్తి శిక్షణ తీసుకొని, తన జీవన శైలిని మార్చుకుంది. ఈ క్రమంలో ఆ అంధురాలు తోటి మహిళలు, అంధులకు స్ఫూర్తిగా నిలుస్తోంది కట్టా అనంతమ్మ. ఆమె స్వస్థలం పులివెందుల నియోజకవరంగలోని లింగాల మండలం అక్కులగారిపల్లె. అక్కులుగారిపల్లె గ్రామనికి చెందిన కట్టా మద్దిలేటి, సుంకులమ్మ కుమార్తె అనంతమ్మ ఆమె వయసు ప్రస్తుతం 52ఏళ్లు. అనంతమ్మ పుట్టుకతోనే అంధురాలు కావడంతో ఇంటికే పరిమితమైంది. భర్త వెంకటేష్ ఎనిమిదేళ్ల క్రితం మరణించాడు. తల్లిదండ్రులు, కట్టుకున్న భర్త తనకు ఎవరూ తోడులేరు. ఆమెకు సంతానం కలగలేదు. ఈ పరిస్థితుల్లో ఆమె జీవితం దయనీయంగా మారింది. జీవన గమనంలో ఎన్నో అటుపోటుల నుంచి పెంచుకున్న కసితో ఇంటి గడప దాటి.. డోరు మ్యాట్లు, జంప్ పట్టలు తయారీని తన స్నేహితురాలి వద్ద ఇరవై రోజుల శిక్షణ తీసుకుంది. అనంతరం నేడు ఆమె తాను తయారు చేసిన వాటిని లింగాల మండలం పలు ప్రాంతాల్లో సరఫరా చేస్తోంది. వీటిద్వారా నెలకు రూ.2,500 నుంచి రూ.4000 వరకు సంపాదిస్తోంది. తన కాళ్లపై నిలబడి తోటి మహిళలకు ఆదర్శంగా నిలిచి శభాష్ అనిపించుకుంటోంది అనంతమ్మ. అంధురాలైనప్పటికీ స్వశక్తిగా రాణిస్తూ.. అధికారుల ప్రోత్సాహంతో బ్యాంకుల నుంచి రూ.50వేలు రుణం పొందారు. ఆ డబ్బుతో అనంతరమ్మ మ్యాట్ల తయారీకి అవసరమయ్యే మెటీరియల్ కొనుగోలు చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సాయం చేస్తే మరింత ముందడుగు వేస్తానని అంటోంది. ఆ మేరకు ప్రజాప్రతినిధులు స్పందించి ఆర్థికసాయం అందిస్తే అనంతమ్మ పలువురికి ఆదర్శంగా నిలవడంలో సందేహమే లేదు.

# యునాని ఆస్పత్రిలో మందులు, సిబ్బంది కొరత

**ప్రజాశక్తి - ఎర్రగుంట్ల**

స్థానిక రాణివనంలో ఉన్న ప్రభుత్వాసుపత్రిలో యునాని మందుల కొరత రెండు నెలలుగా వేధిస్తోంది. సిబ్బంది కొరత కూడా ఉంది. రెండు నెలలుగా యునాని మం దులు రాకపోవడంతో దీర్ఘకాలిక (అలర్జీ, నొప్పులు) మందులు వాడే రోగులు ఇబ్బంది పడు తున్నారు. దీనిపై సోమవారం స్థానిక యునాని డాక్టర్ షహినా పర్వీన్‌ను అడగ్గా.. మందుల కొరత ఉందని తెలిపారు. ప్రతిరోజూ 20 మంది రోగులు గ్యాస్ ట్రబుల్, కీళ్ల నొప్పులు, అలర్జీ, ఫైల్స్ వంటి సమస్యలతో వస్తున్నారని వివ రిం చారు. సిస్టర్ సుధారాణి మెటర్నరీ లీవ్ ఉం ద న్నారు. ఎస్ఎన్ఒ పోస్టు ఖాళీగా ఉందని తెలి పారు. పిహెచ్‌సి డాక్టర్లు జ్యోత్స్న, ప్రియాంక మాట్లాడుతూ గర్భిణులు స్థానికంగా కాన్పు చేయించుకోవడం మంచిదన్నారు. ప్రభుత్వా సుపత్రిలో నెలకు రెండు నుంచి నాలుగు వరకు కాన్పులను సహజం (నార్మల్ డెలివరీ)గా చేస్తు న్నామని తెలిపారు. అన్ని రకాల పరికరాలు ఉన్నాయని తెలిపారు. రోజుకు 120 మంది రోగులు ఆస్పత్రికి వస్తున్నారని తెలిపారు. విష పురుగులు, జంతువులు కాటేస్తే వాడే ఎఎస్‌వి, ఎఆర్‌వి తోపాటు అన్ని రకాల మందులు ఉన్నా యని వారు తెలిపారు. బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ బిల్డింగ్ నిర్మాణ పనులు దాదాపు పూర్త య్యాయని తెలిపారు. ఇక్కడ ల్యాబ్ టెస్టులు, సిబ్బంది సమావేశం భవనంగా విని యోగిం చుకునేందుకు వీలవుతుందన్నారు. వారానికి ఒకరోజు దంత వైద్యులు వస్తున్నారని తెలిపారు.

అరకొరగా ఉన్న యునాని మందులు

సిద్దిక్‌ను సన్మానిస్తున్న టోర్నమెంట్ నిర్వాహకులు

## 'హెల్పింగ్ మైండ్స్' సభ్యులకు సన్మానం

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

మదనపల్లి బిటి కళాశాల మైదానంలో సుకుమార్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను మూడు రోజులుగా ఎస్ఎంబి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. మదనపల్లె చుట్టుపక్కల ప్రాంతాల్లో హెల్పింగ్ మైండ్స్ సేవలను అభినందిస్తూ సోమవారం టోర్నమెంట్ నిర్వహణ స్థలంలో సంస్థ సభ్యులను మెడల్స్‌తో అభినందించారు. సంస్థ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్‌ను దుశ్శాలువా, మెమోంటోతో సత్కరించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ అబూబక్కర్ సిద్దిక్ మాట్లాడుతూ క్రీడలు మానసికల్లోసానికి, దృడంగా ఉండటానికి దోహద పడతాయన్నారు. సుకుమార్ మెమోరియల్ టోర్నమెంట్ లో తమ సంస్థ సేవలను కొనియాడుతూ సన్మానించిన ఎస్ఎంబి టమోటా మండి ఆర్గనైజింగ్ టీంకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్.ఎ.మస్తాన్, తుంగ పృథ్వి రాజ్, బావజాన్, అఖిల్, అల్తాఫ్, బాషా, హెల్పింగ్ మైండ్స్ బృందం పాల్గొన్నారు.

## వీధి దీపాలకు మరమ్మతులు

**ప్రజాశక్తి-పుల్లంపేట**

మండల కేంద్రంలోని మల్లంపేట గ్రామ పంచాయతీలో సోమవారం స్థానిక సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లా డుతూ పంచాయతీ పరిధిలోని పూర్తిగా పనికిరాని వీధి దీపాల స్థానంలో కొత్త వీధి దీపాలను, చిన్నచిన్న రిపేర్లు ఉన్న వీధిదీపాలకు మరమ్మతులు చేయించామని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ మొత్తం ఎల్ఇడి కాంతులతో సంక్రాంతికి కాంతులు వెదజల్లాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ముత్తయ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వీధిదీపాలను మరమ్మతులు చేస్తున్న సర్పంచ్

# క్రైం కార్నర్

శంకర్‌తో మాట్లాడుతున్న నిమ్మనపల్లె పోలీసులు

## ఆస్తి కోసం తమ్ముడిపై అన్న హత్యాయత్నం

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్/నిమ్మనపల్లె**

ఆస్తి కోసం తమ్ముడుపై అన్న అత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి నిమ్మనపల్లి మండలంలో జరిగింది. బాధితుడు పోలీసులకిచ్చిన వివరాల మేరకు.. మండలంలోని ఇ-ఎర్రప్పగారిపల్లి చెందిన శంకర్, గుర్రప్ప అనే ఇద్దరు అన్నదమ్ములకు ఐదున్నర ఎకరా పొలం ఉంది. గతంలోనే తండ్రి అన్నదమ్ములిద్దరికీ చెరి రెండు ఎకరాలు చొప్పున భూమిని భాగాలు పంచి రాసిచ్చాడు. ఒకటిన్నర ఎకరా పొలాన్ని తన పేరు ఉంచుకున్నాడు. తన ఆర్థిక సమస్యల దృష్ట్యా భూమిని విక్రయించే ప్రయత్నంలో ఉండగా కోడలు శంకర్ భార్య స్వర్ణ ఆ భూమిని కొనుగోలు చేసింది. సదరు భూమిని ఆమె పేరుపై పట్టా చేయించాడు. తండ్రి చేత అదనంగా భూమి రాయించుకున్నావని, తమ్ముడితో గొడవకు దిగిన గుర్రప్ప తన వాటా ఇవ్వాలని ఘర్షణ పడ్డాడు. ఈ క్రమంలో కొడవలితో దాడి చేసి తమ్ముడు శంకరపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితున్ని కుటుంబ సభ్యులు మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆసుపత్రిలో చేర్చి చికిత్సలు అందిస్తున్నారు. సోమవారం నిమ్మనపల్లె పోలీస్ సిబ్బంది ఆసుపత్రికి చేరుకొని బాధితున్ని కలిసి వివరాలు తీసుకొని కేసు నమోదు చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

**ప్రజాశక్తి - రామసముద్రం**

మండలంలోని మాలేనత్తం పంచాయతీ నుంచి 20 మంది భక్తులు శనివారం తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శనానికి కాలినడకన బయలుదేరారు. వీరిలో చింపరపల్లికి చెందిన రమణ భార్య పెద్దరెడ్డెమ్మ(40), సింగంవారిపల్లికి చెందిన లక్ష్మన్న భార్య లక్ష్మమ్మ (45) కూడా ఉన్నారు. కాలినడకలో వెళుతున్న క్రమంలో ఆదివారం రాత్రి చంద్రగిరి మండలంలో బసచేసి సోమవారం వేకువ జామున నుండి తిరిగి పాదయాత్ర ప్రారంభించారు. చంద్రగిరి మండలం నరశింగాపురం నారాయణ కళాశాల వద్దకు రాగానే మదనపల్లె నుండి రుయా ఆసుపత్రికి ఓ రోగిని తీసుకొస్తున్న 108 వాహనం భక్తులపై వెనక నుండి దూసుకెళ్లింది. ఘటనలో ఇద్దరు మహిళలు చికిత్స తీసుకుంటూ మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటనపై ఇరు కుటుంబాలు శోకసంద్రంలో మునిగారు. ఇరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై స్థానిక ఎమ్మెల్యే షాజహాన్ బాషా మృతి చెందిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

## జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన మండలంలో సోమవారం జరిగింది. మండలంలోని గుమ్మసముద్రం పంచాయతీ, గుడ్లవారిపల్లెలో నివాసముండే సంజీవ రాజు(45) తెల్లవారుజామున ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. 16 ఏళ్ల క్రితం తన భార్య చనిపోవడంతో ఒంటరిగా జీవిస్తున్నాడు. ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో ఒంటరి జీవితం బతకలేక ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సిఐ జీవన్ గంగానాథ్ బాబు ఆదేశాల మేరకు ఎఎస్ఐ బొజ్జ నాయక్ కేసు నమోదు చేశాడు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొని వ్యక్తికి గాయాలు

**ప్రజాశక్తి-గాలివీడు**

ద్విచక్రవాహనాన్ని ఆటోను ఢీకొన్న సంఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయ. వివరాలు.. సోమవారం గోపనపల్లి పంచాయతీ సిరిపురం వాండ్లపల్లికి చెందిన నల్లబత్తిన సాయిప్రతాప్‌రెడ్డి బస్టాండ్ నుంచి గేట్‌కు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. అదే సమయంలో ఎదురుగా రాంగ్ కూట్‌లో వస్తున్న ఆటో మోటర్‌బైక్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో సాయిప్రతాప్‌రెడ్డి కుడి కాలు విరిగింది. వెంటనే స్థానికులు అతన్ని 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించలోపే ఆటో డ్రైవర్ పరారయ్యాడు. కేసు నమోదు చేసుకుని ఆటో డ్రైవర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## యువకుల మధ్య ఘర్షణ

**ప్రజాశక్తి నందలూరు**

మండలంలోని నందలూరు గ్రామంలో ఆదివారం సాయంత్రం క్రికెట్ ఆటలో తలెత్తిన వివాదం యువకుల మధ్య ఘర్షణకు దారితీసింది. ఈ ఘర్షణలో కరిముల్లా అనే యువకుడికి తీవ్ర గాయాలు కావడంతో కడప రిమ్స్‌కు తరలించారు. ఈ సంఘటనపై దాడికి పాల్పడ్డ వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.